


అతివకు బీమా..

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తోంది. 8లో▸



గుప్త నిధులు తవ్వుతూ..

గుప్తనిధుల వేటలో ఒకరు మృతి చెందగా మరో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 8లో▸



పల్లెల్లో ‘స్థానిక’ సందడి

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. ఇటీవల సీఎం ఎన్నికలకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. 9లో▸

న్యూస్‌రీల్

‘లక్నాపూర్’ కాలువను పరిశీలించిన డీఈ



దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

ధారూరు: మండలంలోని నాగారం గ్రామ సమీపం.. జిలగడ్డ ప్రాంతం వ్యవసాయ పొలాల మీదుగా వెళ్లే లక్నాపూర్ ప్రాజెక్టు కుడి కాలువను మంగళవారం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాఘవేందర్‌తో కలిసి పరిశీలించారు. కాలువలో పేరుకుపోయిన మట్టిని, ముళ్లపొదలు, దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలించారు. కాలువల మరమ్మతులకు రూ.18.44 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పనులు శరవేగంగా చేస్తున్నట్లు వివరించారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



కౌన్సిలర్‌కు నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 34వ వార్డులో డ్వాక్రా భవనం, హెల్త్ సెంటర్ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన అనుమతి పత్రాన్ని ఆ వార్డు టీజేఎస్ కౌన్సిలర్ సోమశేఖర్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పలు వార్డుల్లో రూ.3.65 కోట్ల మున్సిపల్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు కొనసాగుతున్నాయని వివరించారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకి కౌన్సిలర్ సోమశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

హక్కుల సాధనకు కృషి చేయండి

బీజేపీ గీత సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం గౌడ్



హరిగౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న వెంకటేశం గౌడ్

బంట్వారం: గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బీజేపీ గీత సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం గౌడ్ కొత్త సభ్యులకు సూచించారు. మంగళవారం బంట్వారం, మర్పల్లి మండలాలకు చెందిన గీత సెల్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడం తోపాటు గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం గీత సెల్ కృషి చేస్తుందన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు గౌడ కులస్తులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. త్వరలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలను నియమించనున్నట్లు చెప్పారు. బంట్వారం, మర్పల్లి గీత సెల్ అధ్యక్షులుగా హరిగౌడ్, రవిగౌడ్ నియమితులయ్యారు. పార్టీ మండల అధ్యక్షులు మహేష్‌యాదవ్, రామేశ్వర్‌రెడ్డి, జిల్లా నాయకుడు మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

వికారాబాద్‌లో తిరంగా బైక్ ర్యాలీ



అనంతగిరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ పట్టణంలో మంగళవారం మహిళా మోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ సాగింది. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, ఉపాధ్యక్షురాలు మాధవి, విజయలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు దీపిక, నాయకులు మహేశ్వరి, అన్నపూర్ణ, రాధిక, దీపిక, స్వప్న, శ్వేత, నవ్య, స్రవంతి, శైలజ, మాధురి పాల్గొన్నారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న సంఘం నాయకుడు

సంఘటితమవుదాం

దామగుండాన్ని కాపాడుకుందాం

- జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- ఏఐకేఎంఎస్ నాయకుల డిమాండ్
- సేవ్ దామగుండం – సేవ్ వికారాబాద్ పేరిట చర్చావేదిక

అనంతగిరి: ప్రజలు, ప్రజాసంఘాలు సంఘటితమై దామగుండాన్ని కాపాడుకుందామని పలు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.మంగళవారం వికారాబాద్‌లోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఏఐకేఎంఎస్ (ఆల్ ఇండియా కిసాన్ మజ్దూర్ సంఘ్)ఆధ్వర్యంలో సేవ్ దామగుండం–సేవ్ వికారాబాద్ అనే అంశంపై చర్చావేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు పేరుతో 12 లక్షల చెట్లను కొట్టివేయాలని చూడటం సరికాదన్నారు. దీన్ని ఆపి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.అనంతగిరి అడవులను కాపాడుకోవాలంటే నేవీ రాడార్ స్టేషన్‌ను అడ్డుకోవాల్సిందేనని అన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.అనంతగిరి కొండల్లో రాడార్ స్టేషన్ ఏర్పాటు మంచిది కాదని పర్యావరణ,విద్యావేత్తలు ఇప్పటికే స్పష్టం చేశారని తెలిపారు. హైదరాబాద్, వైజాగ్, ముంబై,జమ్మూ,భోపాల్ వంటి 13 ప్రాంతాల్లో, 18 నగరాల్లో నిరసన ప్రదర్శనలు కూడా జరిగాయని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రానికి, ప్రజలకు గణనీయమైన నష్టాలు కలుగుతాయన్నారు.ముఖ్యంగా హైదరాబాద్‌కు ముప్పు ఉందన్నారు.నేవీకి 2,900ఎకరాల అటవీ భూమిని అప్పగించాలంటే దాదాపు 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందన్నారు. ఇది పర్యావరణానికి పెద్ద దెబ్బ అన్నారు.అనంతగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామంటున్న ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. రాడార్ స్టేషన్‌తో దాదాపు 20 గ్రామాల్లోని 60వేల మంది ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అటవీ విధ్వంసం అనంతరం ఆ ప్రభా వం మూసీ, కాగ్నా నదులపై పడుతుందని పేర్కొన్నారు. రేడియేషన్‌తో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు.ఈ ప్రాజెక్టును అడ్డుకోవడం ద్వారా పర్యావరణాన్ని,ప్రజలను కాపాడినవారమవుతామన్నారు. అందరం సంఘటితమై ప్రాజెక్టు నిర్ణయాన్ని వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, పూడూరు మాజీ ఎంపీపీ మల్లేశం, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్, పీఓడబ్ల్యూ జిల్లా ఇన్‌చార్జ్ గీత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేందర్‌గౌడ్, నాయకులు వెంకటయ్య,రవిబాబు, కృష్ణ, శివరాజు, రామన్న, శ్రీనివాస్, వెంకటయ్య, వెంకటేశం,రుచిత, జాకీర్, మల్లేశం, నికిత, యాదయ్య, శ్రీకాంత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు ఢీకొని 65జీవాల మృత్యువాత

- అడవి పందులు చుట్టుముట్టడంతో.. బెదిరి పట్టాలపైకి వచ్చిన మేకలు
- ధారూరు మండలంలో ఘటన
- దాదాపు రూ.5.50 లక్షల నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల అభ్యర్థన



చనిపోయిన మేకలను పరిశీలిస్తున్న యజమానులు



రైళ్లు ఢీకొనడంతో పట్టాలపై చెల్లాచెదురుగా పడి ఉన్న మేకల కళేబరాలు

ధారూరు: అడవి పందులను చూసి బెదిరి పట్టాలపైకి చేరిన మేకలను ఒకే సమయంలో వచ్చిన రెండు రైళ్లు ఢీ కొట్టడంతో 65 జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన ధారూరు రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. మేకల యజమానులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. డీకేతండాకు చెందిన కెతావత్ రమేశ్‌కు చెందిన 20 మేకలు, చంద్రిబాయికి చెందిన 20 మేకలు, కిష్టిబాయికి చెందిన 15 మేకలు, ఫుల్‌సింగ్‌కు చెందిన 7 మేకలు, బాల్‌రాజ్ నాయక్ చెందిన 3 మేకలను ఉదయం మేత కోసం సమీప అడవిలోకి తోలుకెళ్లారు. సాయంత్రం మేకలను ఇళ్లకు తీసుకొస్తుండగా మదనంతపూర్ మైసమ్మ బ్రిడ్జి వద్ద అడవి పందులు మేకలను చుట్టుముట్టాయి. దీంతో అవి బెదిరి రైల్వే పట్టాలపై పరుగుతీశాయి. గమనించిన చంద్రిబాయి వాటిని పట్టాల పైనుంచి అవతలి వైపునకు దాటించేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో తాండూరు, వికారాబాద్ ప్రాంతాల వైపు నుంచి వచ్చిన రెండు రైళ్లు మేకలను ఢీకొట్టాయి. దీంతో 65జీవాలు మృత్యువాత పడ్డాయి. చంద్రిబాయి పట్టాల నుంచి పక్కకు తప్పుకోవడంతో ప్రాణాలతో బయటపడింది. ఘటన స్థలంలో 42 మేకల కళేబరాలు లభ్యం కాగా మరో 23 మేకలను రైళ్లు నెట్టుకెళ్లిపోయాయి. విషయం తెలుసుకున్న బాధిత యజమానులు ప్రమాద స్థలానికి చేరుకొని మేకల కళేబరాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. చనిపోయిన మేకల విలువ దాదాపు రూ.5.50 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

వంద అడుగుల ఎత్తులో త్రివర్ణ పతాకం

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఆగస్టు 15న వంద అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఇందుకోసం రూ.20 లక్షలు కేటాయించారు. ఇప్పటికే వంద అడుగుల ఎత్తు గల ఇనుము, ఉక్కు స్తంభాన్ని తయారు చేయించి కార్యాలయం ఎదుట ఉంచారు. ఆగస్టు 15న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న జెండాను ఆవిష్కరించనున్నారు. ఇందులో భాగంగా ప్రజా ప్రతినిధులు, పార్టీల నాయకులకు ఆహ్వాన పత్రికలు పంపుతున్నారు.

– తాండూరు



తాండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట వంద అడుగుల జెండా స్తంభం

‘ధరణి’ సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. మంగళవారం పరిగి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్ట్రేషన్, డేటా ఎంట్రీ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

అర్హులకు పథకాలు అందాలి

అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి ప్రజాపాలన కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రజాపాలనలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని అర్జీలను పరిష్కరించారని అడిగారు. ప్రజాపాలనలో వచ్చిన ప్రతి దరఖాస్తును పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అర్హులైన వారికి గృహజ్యోతి,మహాలక్ష్మి(గ్యాస్)పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రజాపాలనలో మ్యాచ్ కానీ దరఖాస్తులను ఎలా గుర్తించాలో అవగాహన కల్పించారు. జీపీల వారీగా చేయాల్సి పనులు, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను పరిశీలించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరిగి తహసీల్దార్ ఆనంద్, ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సీఎంఆర్ అందాలి

అనంతగిరి: మిల్లు పట్టిన బియ్యాన్ని(సీఎంఆర్) సకాలంలో ఎఫ్‌సీఐకి చేరాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీలో అలసత్వంపై మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బియ్యం సరఫరాలో అలసత్వం వద్దన్నారు. 2021– 22 ఖరీఫ్ సీజన్ సంబంధించి సీఎంఆర్‌ను వెంటనే పౌరసరఫరాల శాఖకు చేరేలా చూడాలన్నారు. అలాగే 2022 – 23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సెప్టెంబరు మొదటి వారంలోగా డెలివరీ చేయాలన్నారు. ఇకపై సమయం పెంచబోమని స్పష్టం చేశారు. మిల్లుల యజమానులు, యూనియన్ నాయకులు ఒక్క తాటిపైకి వచ్చి బియ్యం అందేలా చూడాలన్నారు. జిల్లాలోని రైస్ మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి బియ్యం నిల్వల వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణబాయ్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, పౌరసరఫరాల డీటీలు పాల్గొన్నారు.

రైతుల భూములు లాక్కోవడం అన్యాయం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

కొడంగల్ రూరల్: అభివృద్ధి పేరుతో నియోజకవర్గంలోని రైతుల భూములు లాక్కోవడం అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన భూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫార్మా కంపెనీ పేరుతో హకీంపేట, లగచర్ల, పోలెపల్లి, పులిచర్లతండా, రోటిబండ తండాల్లోని 1,274 ఎకరాలు, కొడంగల్ మండలం ఎరన్పల్లిలో 74ఎకరాల భూములను మెడికల్, నర్సింగ్ కళాశాల కోసం సేకరిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనుల కోసం కొడంగల్‌లోని 1,156 ఎకరాల సీలింగ్ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా అధికార యంత్రాంగం ప్రభుత్వ అసైన్డ్ భూముల జోలికి వెళ్లకుండా సన్న, చిన్నకారు రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. ధరణి పోర్టల్‌తో ఏర్పడిన భూ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష్యుడు బుగ్గప్ప, ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రయ్య, ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్రతిపాదన విరమించుకోవాలి

- మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దు
- యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న



ఇబ్రహీంపట్నంలో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే ప్రతిపాదనను ప్రభు త్వం విరమించుకోవాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించి, మండల విద్యా వనరుల కేంద్రంలోని అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 54,202 మంది మధ్యాహ్న భోజన కార్మికులు 24 ఏళ్లుగా కష్టనష్టాలను భరిస్తూ పనిచేస్తున్నారని అన్నారు. అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన మహిళలే ఉన్నారని.. అలాంటి వారి ఉపాధిని పరిగణలోకి తీసుకోకుండా ఈ పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చేందుకు నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులకు సకాలంలో బిల్లులు రాకపోయినా అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతూ ఆర్థిక ఇబ్బందులను సైతం భరిస్తున్నారని తెలిపారు. కార్మికుల వేతనాలు నెలల తరబడి పెండిగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్నికలకు ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి, ఇప్పుడు వారి పొట్టలు కొట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో 21న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా నాయకులు ఎల్లేష్, బుగ్గరాములు, తులసిగారి నర్సింహ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నందుకు గాను వంట సిబ్బంది అప్పులపాలవుతున్నారని మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యాచారం తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చందునాయక్, ఎల్లేష్, చంద్రకళ, మల్లారి, పద్మ, యాదమ్మ, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాండూరు టౌన్‌: పట్టణంలోని చెరువెంటి ఈశ్వరాలయానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆలయానికి నిత్యం భక్తులు తరలివస్తారని రోడ్డు మార్గం సరిగా లేక ఇబ్బంది పడుతున్నారని వారు మనోహర్‌రెడ్డికి వివరించారు. ప్రధాన రోడ్డు నుంచి ఈశ్వరాలయం వరకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వాలి శాంతికుమార్‌, జొన్నల బస్వరాజ్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్న పరిమళ్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పటోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు సోమశేఖర్‌, నీరజ, లలిత, ప్రవీణ్‌, వెంకన్న గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం–శ్రీ'కి కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ ఎంపిక

ఎంఈఓ చంద్రప్ప



ఢిల్లీకి బయలుదేరిన విద్యార్థి సాయిచరణ్‌, ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌

బంట్వారం: పీఎం–శ్రీ (ప్రధాన మంత్రి స్కూల్‌ ఫర్‌ రైజింగ్‌ ఇండియా) స్కీంకు కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాల ఎంపికైనట్లు మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. ఆగస్టు 15న ఢిల్లీలో ప్రధాని మోదీ పాల్గొనే వేడుకలకు తమ పాఠశాలకు ఆహ్వానం అందిందన్నారు. ఈ క్రమంలో పాఠశాల నుంచి పదోతరగతి విద్యార్థి సాయిచరణ్‌తో పాటుగా స్కూల్‌ అసిస్టెంట్‌ లక్ష్మణ్‌ మంగళవారం ఢిల్లీకి పంపించామన్నారు. పీఎం–శ్రీ పథకం ద్వారా ఫిజిక్స్‌, కెమిస్ట్రీ, సైన్స్‌ ల్యాబ్స్‌, లైబ్రరీల ఏర్పాటు, ఫిజికల్‌ ఫిట్‌నెస్‌ను పెంపు చేయడంతో పాటు పాఠశాల మైదానం అభివృద్ధి చేస్తారన్నారు. ఔట్‌డోర్‌, ఇన్‌డోర్‌ స్టేడియం నిర్మించడం వంటి అదనపు సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. భవిష్యత్‌లో ఈ పాఠశాలలను జూనియర్‌ కళాశాలలుగా అప్‌గ్రేడ్‌ చేస్తారన్నారు.

నాలుగేళ్ల క్రితం హత్య

ముగ్గురికి జీవిత ఖైదు, జరిమానా విధించిన కోర్టు

కేశంపేట: నాలుగేళ్ల క్రితం జరిగిన హత్య కేసు నిందితులకు జీవితకాలం జైలు శిక్షతోపాటుగా జరిమానా విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి హరీష తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామానికి చెందిన మృతుడు జిన్నారం జంగయ్య(38), శివకుమార్‌, గణేశ్‌ మిత్రులు. జంగయ్య భార్య జంగమ్మతో శివకుమార్‌కు అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో భార్యతో పలుమార్లు గొడవపడ్డాడు. విషయం మనుసులో పెట్టుకున్న శివకుమార్‌ స్నేహితుడు గణేశ్‌తో కలిసి 2020 ఆగస్టు 23న జంగయ్యకు కేశంపేట వైన్స్‌ వద్ద మద్యం తాగించి చింతకుంటపల్లి శివారులోకి తీసుకెళ్లి తలపై దాడి చేసి చంపేశారు. ఇదే విషయం 2020పై ఆగస్టు 24న చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. షాద్‌నగర్‌ రూరల్‌ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ కోన వెంకటేశ్వర్లు పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. జిల్లా 9వ అడిషనల్‌ కోర్టులో నేరం రుజువ్వవడంతో న్యాయమూర్తి హరీష ముగ్గురుకి జీవితకాల జైలు శిక్షతో పాటుగా శివకుమార్‌కు రూ.30వేలు, గణేశ్‌, జంగమ్మలకు రూ.20వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసును న్యాయవాది రఘు వాదించినట్టు ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ తెలిపారు.

అతివకు బీమా.. కుటుంబానికి ధీమా



మహిళా సంఘాల సభ్యుల సమావేశం (ఫైల్‌)

- జీరో ప్రీమియంతో 'ఇందిరా జీవిత బీమా'
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాలు

దౌల్తాబాద్‌: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అందులో భాగంగా వీరికి తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తుంది. అయితే.. గతంలో రుణం తీసుకున్న సభ్యులు మరణిస్తే ఆ రుణ భారం కుటుంబసభ్యులపై పడేది. దీంతో మహిళా సంఘాల్లో బకాయిలు పెరిగి మొండి బకాయిలుగా పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో మహిళా సంఘాల్లోని క్రమశిక్షణను కాపాడుకునేందుకు మరణించిన కుటుంబంపై భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న ఇందిరా జీవిత బీమా పేరిట బీమా సదుపాయాన్ని అమలులోకి తెచ్చింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ, ప్రమాద బీమా పథకాలను అమలు చేస్తుంది. రుణ, ప్రమాద బీమాలకు మహిళా సంఘం సభ్యురాలి నుంచి ఒక్క రూపాయి ప్రీమియం వసూలు చేయకుండా మొత్తం ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది.

రుణబీమా

రుణబీమా కూడా ఇందిరా జీవిత బీమా పథకంలో భాగంగానే అందిస్తున్నారు. ఈ బీమా బ్యాంకు లింకేజీ ద్వారా వర్తిస్తుంది. మహిళా సంఘంలో రుణం తీసుకున్న మహిళ ఏదైనా కారణంతో మరణిస్తే, సదరు మహిళ మరణించే నాటికి ఎంత అప్పు ఉంటే అంత మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సంబంధిత లోన్‌ అకౌంట్‌కు చెల్లిస్తారు. ఒక్కో సభ్యురాలికి గరిష్టంగా రూ.2లక్షల వరకు రుణబీమా సదుపాయం కల్పిస్తారు.

ఆన్‌లైన్‌ నమోదు

బీమా సదుపాయానికి సంబంధించి మహిళలు ప్రత్యేకంగా ఎటువంటి ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరంలేదు. మార్చి 14 నాటికి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదై ఉన్న మహిళా సంఘాల సభ్యులందరికీ బీమా వర్తిస్తుంది. ఒకవేళ మరణిస్తే మాత్రం వివరాలతో పాటు తగిన ఆధారాలను ఐకేపీ కార్యాలయంలో అందించాలి.

ప్రమాద బీమా

ఇందిరా జీవిత బీమా పథకంలో భాగంగా మహిళలకు ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నారు. స్వయం సహాయక సంఘాల్లో 18 నుంచి 59 ఏళ్ల వయస్సులోపు సభ్యురాలు ప్రమాద బీమాకు అర్హులు. మహిళా ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబసభ్యులు తగిన ఆధారాలను సంబంధిత కార్యాలయంలో అందిస్తే రూ.10లక్షల ప్రమాద బీమా సొమ్మును అందజేస్తారు.

సంఘాలకు రక్షణ

ఇది వరకు మహిళా సంఘాలకు ఎలాంటి బీమా సదుపాయం లేదు. సభ్యురాలు అకాలంగా మరణిస్తే వారి కుటుంబసభ్యులపై రుణభారం పడేది. తాజాగా ప్రభుత్వం బీమా కల్పించడంతో సంఘాలకు ఊరట కలిగింది.

– సాయన్న, ఏపీఎం, దౌల్తాబాద్‌

ఉద్యోగులకు బదిలీలు సహజం



బదిలీ అయిన ఉద్యోగులను సన్మానించిన ఎస్‌ఐ తదితరులు

యాలాల ఎస్‌ఐ శంకర్‌

యాలాల: ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో బదిలీ అనేది సహజమని యాలాల ఎస్‌ఐ శంకర్‌ అన్నారు. యాలాల పీఎస్‌లో విధులు నిర్వ హించి బదిలీ అయిన ఉద్యోగులను మంగళవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఏఎస్‌ఐ రాజశేఖర్‌, ఉమెన్‌ హెడ్‌కానిస్టేబుల్‌ నర్సమ్మ, కానిస్టేబుళ్లు అమృత, వెంకట్‌, శ్రీకాంత్‌, శ్రీశైలం యాలాల పీఎస్‌ నుంచి ఇతర పీఎస్‌లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఉద్యోగులు తాము పని చేసే చోట ఎంతో అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదోన్నతులు పొందాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సంతలో చోరీకి గురైన సెల్‌ఫోన్ల అప్పగింత



రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఎస్‌ఐ

ధారూరు: చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రతీ శనివారం ధారూరు మండల కేంద్రంలో కూరగాయల సంత కొనసాగుతుంది. రద్దీగా ఉండే సమయంలో చేతివాటం ప్రదర్శిస్తున్న దొంగలు జనాల సెల్‌ఫోన్లు కొట్టేసి పరారవుతున్నారు. గత వారం సంతలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు.. గురుదోట్ల గ్రామానికి చెందిన రాములు, నాగసాన్‌పల్లికి చెందిన ఎం.నర్సింహులు, వికారాబాద్‌ మండలం మదన్‌పల్లికి చెందిన శశికళ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ చేయబడిన సెల్‌ఫోన్లను సీఈఐఆర్‌ పరిజ్ఞానంతో కనిపెట్టిన పోలీసులు మంగళవారం ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ చేతుల మీదుగా బాధితులకు అప్పగించారు.

పెండింగ్‌ డీఏలు విడుదల చేయాలి

పీఆర్టీయూ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న పీఆర్టీయూ నాయకులు

యాలాల: పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలతో పాటుగా పీఆర్సీని ప్రకటించాలని పీఆర్టీయూ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి డిమాండ్‌ చేశారు. మండల పరిధిలోని అగ్గనూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్‌తో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. సీపీఎస్‌ రద్దు చేస్తామని కాంగ్రెస్‌ ఇచ్చిన ఎన్నికల హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. పాత పెన్షన్‌ విధానాన్ని అందుబాటులోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ల ఏర్పాటు, భవనాలకు ఉచిత విద్యుత్‌ అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి స్పందన అభినందనీయమన్నారు. అగ్గనూరు, జుంటుపల్లి బెన్నూరు, యాలాల, దేవనూరు గ్రామాల్లో పీఆర్‌టీయు సంఘ సభ్యత్వ నమోదును చేపట్టారు. అనంతరం ఇటీవల పదోన్నతుల్లో భాగంగా ఆయా పాఠశాలలకు వచ్చిన కొత్త ఉపాధ్యాయులను సంఘం తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర బాధ్యులు మొగులయ్య, లక్ష్మయ్య, జిల్లా బాధ్యులు కృష్ణారెడ్డి, రమేశ్‌, సంఘ సభ్యులు ప్రభాకర్‌చారి, షఫీ, రాములు, రవికుమార్‌, రవి కుమార్‌జోషి, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

ఎస్‌ఐ గిరి

పెద్దేముల్‌: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ గిరి హెచ్చరించారు. మంగళవారం తాండూరు–సంగారెడ్డి రహదారిపై మండల పరిధిలోని మారేపల్లి గేటు వద్ద డ్రంకెన్‌ డ్రైవ్‌ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తప్పకుండా ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అబ్దుల్లాపూర్‌మెట్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలం కేంద్రంలోని ఎస్‌ఆర్‌ హాస్టల్‌ సమీపంలో ఓ గుర్తు తెలియని (సుమారు 55–60 ఏళ్ల మధ్య ఉన్న) వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారం అందింది. మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఒంటరి మహిళపై లైంగిక దాడి

శంకర్‌పల్లి: ఓ ఒంటరి మహిళపై అత్యాచారం జరిగిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్‌ తెలిపిన ప్రకారం.. ఓ కాలనీకి చెందిన ఒంటరి మహిళ(23) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కొన్నేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయాడు. అదే కాలనీకి చెందిన ఈ.రవి(35) అనే వ్యక్తి ఆదివారం మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఆ మహిళతో గొడవపడి అనంతరం ఆమెని బలవంతంగా తన బిల్డింగ్‌ మీదకి తీసుకుని వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధిత మహిళ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకోని విచారించగా.. అతనిపై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు గుర్తించామని సీఐ తెలిపారు.

ఉలిక్కిపడిన నక్కర్తమేడిపల్లి

- గ్యాంగ్‌స్టర్‌ హత్యలో పాల్గొన్న సుపారీ గ్యాంగ్‌ తలదాచుకున్నట్లు సమాచారం
- గ్రామాన్ని చుట్టుముట్టిన పోలీసులు
- సాయంత్రం 4గంటల వరకు విచారణ



నక్కర్తమేడిపల్లిలో యువకులను విచారణ చేసిన ఇల్లు

యాచారం: నక్కర్తమేడిపల్లి గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్యాంగ్‌స్టర్‌ను హత్య చేసిన నిందితులు గ్రామంలో తలదాచుకున్నారనే విషయం తెలియడంతో గ్రామస్తులంతా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. కొద్ది రోజుల క్రితం బాలాపూర్‌లో గ్యాంగ్‌స్టర్‌ రియాజ్‌ హత్యలో పాల్గొన్న నిందితులు గ్రామంలోని హైదరాబాద్‌ గ్రీన్‌ ఫార్మాసిటీ పోలీస్‌ స్టేషన్‌కు సమీపంలో ఓ ఇంట్లో తలదాచుకుంటున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో మంగళవారం ఉదయం రాచకొండ స్పెషల్‌ పార్టీ పోలీస్‌ బృందం ఆ ఇంటిని చుట్టుముట్టి కొందరిని అదుపులోకి తీసుకుని ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు విచారించింది. విచారణ సమయంలో ఆ ఇంటి పరిసరాల్లోకి గ్రామస్తులను అనుమతించలేదు. గ్యాంగ్‌స్టార్‌ రియాజ్‌ హత్యకు ముందు సుపారీ గ్యాంగ్‌ నక్కర్తమేడిపల్లి గ్రామంలో తలదాచుకున్నారా..? లేదా హత్య తర్వాత వచ్చి షెల్టర్‌ తీసుకున్నారా.? అని గ్రామంలో చర్చలు కొనసాగుతున్నాయి. ఒక్కసారిగా పోలీసు బలగాలు గ్రామంలోకి రావడం.. కొంతమందిని అదుపులోకి తీసుకోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఇదే విషయమై హైదరాబాద్‌ గ్రీన్‌ ఫార్మాసిటీ పోలీస్‌ స్టేషన్‌ సీఐ నర్సింహారావును 'సాక్షి'ఫోనులో సంప్రదించగా బాలపూర్‌లో జరిగిన ఓ హత్య విషయమై స్పెషల్‌ పార్టీ పోలీసులు విచారణ చేసినట్లు తెలిసిందన్నారు.

వికారాబాద్‌లో వైద్యుల కొవ్వొత్తుల ర్యాలీ



వికారాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

అనంతగిరి: కలకత్తాలో జూనియర్‌ డాక్టర్‌ ఘటన విషయమై మంగళవారం రాత్రి వికారాబాద్‌ పట్టణంలో ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి ఎన్‌టీఆర్‌ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఐఎంఏ ప్రతినిధులు మాట్లాడుతూ.. దుశ్చర్యకు పాల్పడిన నిందితుడిని వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్‌ రాజశేఖర్‌, మధుసూదన్‌రెడ్డి, సాధు సత్యనాథన్‌, శ్రీకాంత్‌, జయంతిక జ్ఞాని, రమ్యశ్రీ, భరత్‌రెడ్డి, జూనియర్‌ డాక్టర్‌లు పాల్గొన్నారు.

కేన్సర్‌ రోగులను గుర్తించేందుకు క్యాంపులు

జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ నిరోషా



దారూరు పీహెచ్‌సీలో పరీక్షలకు హాజరైన జనం

ధారూరు: గ్రామీణ ప్రాంతాల్లో కేన్సర్‌ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా ఆరు పీహెచ్‌సీల్లో ప్రత్యేక కేన్సర్‌ స్క్రీనింగ్‌ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు నాన్‌ కమ్యూనికల్‌ డిసీజ్‌ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ నిరోషా తెలిపారు. ఇండియన్‌ కేన్సర్‌ సొసైటీ, మ్యాగ్నా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం దారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాంపు నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్ల ద్వారా అనుమానితులను గుర్తించి క్యాంపునకు తరలించారు. 108 మందికి పరీక్షలు నిర్వహించి ఆరుగురు అనుమానితులను ఎంఎన్‌జేకు రిఫెర్‌ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ బుచ్చిబాబు, ఎన్‌సీడీ కోఆర్డినేటర్‌ రేణుకుమార్‌, హెచ్‌ఈ వేణు, ధారూరు ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్‌ విద్య, డాక్టర్‌ స్వాతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తొలిదశలో గుర్తిస్తే కేన్సర్‌కు అడ్డుకట్ట

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ విజయలక్ష్మి



కొందుర్గు: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొందుర్గు: కేన్సర్‌ వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే రోగులను కాపాడుకోవచ్చునని షాద్‌నగర్‌ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం డాక్టర్‌ అమ్రిత జోసెఫ్‌ ఆధ్వర్యంలో కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కేన్సర్‌ పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్‌ విజయలక్ష్మి మాట్లాడుతూ.. కేన్సర్‌ వ్యాధి తొలిదశలో ఉంటే సరైన పోషకాహారం తీసుకుని వ్యాయామం చేయడం, వైద్యుల సలహామేరకు మందులు వాడితే వ్యాధి నుంచి బయటపడొచ్చన్నారు. ప్రజలను వ్యాధి నుంచి రక్షించేందుకు ప్రభుత్వమే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో పది రకాల పరీక్షలు చేస్తారని.. అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్‌ అమ్రిత జోసెఫ్‌ మాట్లాడుతూ.. 142 మంది పరీక్షలు చేయించుకున్నారని వీరిలో 32 మందికి హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రిలో మరిన్ని పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నిఖిత, హరికిషన్‌, రాఘవేందర్‌, సీహెచ్‌ఓ మంజుల, పీహెచ్‌ఎన్‌ఓ లుదియా, ఎంపీహెచ్‌ఈఓ మున్వర్‌ హుస్సేన్‌, శ్రీనివాస్‌, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



జెండాను ఎగురవేసిన మాధవరెడ్డి

అనంతగిరి: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేసి దేశభక్తి చాటి చెప్పాలని వికారాబాద్‌ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొకట్‌ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం హర్‌ ఘర్‌ తిరంగాలో భాగంగా ఆయన తన ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి వెళ్లి జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు.

గుప్త నిధులు తవ్వుతూ..

- బండరాయి మీద పడటంతో వ్యక్తి దుర్మరణం
- అనుమానాస్పదన మృతి కేసును ఛేదించిన పోలీసులు
- ఎనిమిది మందికి రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

కొడంగల్‌ రూరల్‌: గుప్తనిధుల వేటలో ఒకరు మృతి చెందగా మరో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం పట్టణంలోని సీఐ కార్యాలయ ఆవరణలో ఇన్‌స్పెక్టర్‌ శ్రీధర్‌రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. మే 21న బొంరాస్‌పేట మండలం నాందార్‌పూర్‌ శివారులో బ్రిడ్జి దగ్గర కుళ్లిన స్థితిలో కుమ్మరి సత్యప్ప మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు కుమ్మరి నరేశ్‌ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా బొంరాస్‌పేట ఠాణాలో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా దోమ మండలం దాదాపూర్‌కు చెందిన మృతుడు సత్యప్ప ఫోన్‌కాల్‌ లిస్ట్‌ ఆధారంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారామపురం గ్రామానికి చెందిన పొలాస్‌ సత్తయ్య(సత్యనారాయణ) హైదరాబాద్‌లోని అంబర్‌పేట తురబ్‌నగర్‌ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈయన ఐదేళ్ల క్రితం భువనగిరి, నల్గొండ జిల్లాల్లో గుప్త నిధుల తవ్వకాలు చేపట్టగా ఎలాంటి నిధులు లభించలేదు. మహబూబ్‌నగర్‌ జిల్లా నస్కల్‌పేట గ్రామంలోని రాళ్లగుట్టలో నిధి ఉన్నట్లు తెలుసుకుని ఏడాది క్రితం అక్కడకు చేరుకున్నారు. ఏనుగు బొమ్మ, రాతి కట్టడం ఉందని నగరంలోని పాతబస్తీకి చెందిన తన గురువు షకీల్‌కు సత్యనారాయణ చెప్పాడు. అక్కడే నిధి ఉంటుందని గురువు చెప్పడంతో సత్యనారాయణతో పాటుగా మృతుడు సత్తయ్య, నారాయణపేట జిల్లా కోస్గి మండలం నాగసాన్‌పల్లికి చెందిన శంకరయ్య, నస్కల్‌పేట గ్రామస్తుడు నాగరాజు , సైదులు, వెంకటయ్య, శర్మ, సుందరయ్య, నిధి ఉన్నట్లు భావిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం సత్యప్ప, శంకరయ్య, నాగరాజు, వెంకటయ్య గుట్టను 18ఫీట్ల లోతు తవ్వారు. ఎలాంటి నిధి లభించక పోవడంతో షకీల్‌ను అక్కడకు తీసుకువచ్చి చూపించారు. అడ్డం తవ్వితే నిధిలభిస్తుందని చెప్పడంతో మే 17న రాళ్ల గుట్ట తవ్వుతున్న క్రమంలో సత్యప్పపై బండరాయి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే వారు అదే రోజు రాత్రి పది గంటల సమయంలో శర్మ కారులో సత్యప్ప శవాన్ని బొంరాస్‌పేట మండలం నాందాపూర్‌ శివారులోని కల్వర్టు వద్దకు తీసుకొచ్చారు. శవాన్ని బైక్‌పై ఉంచి కల్వర్టు పై నుంచి కిందకు తోసేశారు. కాల్‌ హిస్టరీ ఆధారంగా శంకరయ్యను విచారించగా నేరం ఒప్పుకొన్నాడని సీఐ తెలిపారు. గుప్త నిధుల తవ్వకాల్లో మృతుడితో పాటుగా మరో ఎనిమిది మంది ఉన్నట్లు గుర్తించి రిమాండ్‌ తరలించినట్లు సీఐ తెలిపారు. ఒక కారు, ఎనిమిది సెల్‌ఫోన్లు, తవ్వకాలకు ఉపయోగించిన సామగ్రిని సీజ్‌ చేశామన్నారు. కేసును ఛేదించిన బొంరాస్‌పేట ఎస్‌ఐ రవూఫ్‌, సిబ్బంది బాలు, శ్రీనును సీఐ అభినందించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పించండి

- వీహెచ్‌పీ రాష్ట్ర నాయకుడు రమేశ్‌
- నేడు నిరసన ర్యాలీ



షాద్‌నగర్‌రూరల్‌: బంగ్లాదేశ్‌లో హింసాకాండ జరుగుతున్న నేపథ్యంలో అక్కడి హిందువులకు భద్రత కల్పించాలని విశ్వహిందూ పరిషత్‌ రాష్ట్ర నాయకుడు బండారి రమేష్‌ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులు, సిక్కులు, ఇతర మైనార్టీలకు చెందిన వ్యాపార సంస్థలు, ఇళ్లు దాడికి గురయ్యాయన్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలు, గురుద్వారాలు దుకాణాలు, హిందూ శ్మశాన వాటికలు ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు 32శాతం ఉన్న హిందువులు నేడు 8 శాతానికి తక్కువగా ఉన్నారంటే ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న హింసాకాండ ఏ విధంగా ఉందో అర్థమవుతుందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌లోని హిందువుల భద్రతకు, మానవ హక్కుల పరిరక్షణకోసం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ బుధవారం ఉదయం 10గంటలకు పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు నిరసన ర్యాలీని చేపడుతున్నామన్నారు. ఈ ర్యాలీకి పరిసర ప్రాంతాల్లో హిందువులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

అదుపుతప్పిన బైక్‌

వ్యక్తికి తీవ్ర గాయాలు

పూడూరు: బైక్‌ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పరిగి మండలం నజీరాబాద్‌ తండాకు చెందిన హేమ్యా(54) మన్నెగూడ నుంచి పరిగి వైపు ప్రయాణిస్తున్నాడు. మండల పరిధిలోని సోమన్‌గుర్తి స్టీల్‌ ఫ్యాక్టరీ వద్ద బైక్‌ అదుపు తప్పడంతో హేమ్యా రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.